"ఆంధ్ర పద్య కవితా పితామహులు"

డా॥ నందూరి రామకృష్ణమాచార్య విరచిత

# విహంగ వీక్షణము

## సాహిత్య సమీక్ష

సమర్పణ :


**తెనుఁగు భారతి సాహిత్య పరిషత్**

ఆంధ్రప్రదేశ్

"ఆంధ్ర పద్య కవితా పితామహులు"

డా॥ నందూరి రామకృష్ణమాచార్య విరచిత

# విహంగ వీక్షణము

## సాహిత్య సమీక్ష

సంకలనకర్త

శ్రీ మంతెన వేంకట సూర్యనారాయణ రాజు కవి

65, బి.హెచ్.ఇ.యల్ ఎన్‌క్లేవ్, అక్బరు రోడ్

సికిందరాబాదు - 500 009,

ఫోన్ : 7754415

ప్రచురణ కర్త

శ్రీ జి.వి. హనుమంతరావు

హిందీ పండితులు

శ్రీనగర్ కాలనీ, గన్నవరం - 521101

ఫోన్ - 512693 (08676)

# అను క్రమణిక


1. జాతీయ పతాకం ........ 6
2. స్వాతంత్ర్య ప్రభాస ........ 7
3. తెలుగు తల్లి ........ 10
4. స్వాగత సూక్తమ్ ........ 12
5. కైవారము ........ 13
6. ఆరాధన ........ 14
7. కవితా కల్హార మాలిక ........ 15
8. అన్యాపదేశము ........ 16
9. శీర్షమేఖల ........ 17
10. ప్రగతి గీతమాల ........ 21
11. రాధనురా ! ........ 22
12. లేజవరాలనురా ! ........ 23
13. నా హృది ........ 23
14. గురువు ........ 25
15. లలిత కళలు ........ 25
16. నదులు కలుపు ........ 26
17. జీవిత సూక్తము ........ 27
18. చాటువులు ........ 28
19. ఛత్రపతి శివాజి ........ 29
20. ధర్మచక్రం ........ 30
21. ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ........ 31
22. ఆనంద సూక్తము ........ 32
23. ముత్యాల గొడుగు ........ 33
24. కవితా సంహిత ........ 35
25. జగదేక పార్లమెంటు ........ 36
26. మరణ మంగళాశాసనం ........ 38
27. కవితా కర్పూర నీరాజనము ........ 40

# కర్పూర తాంబూలం

ఎందరో మహానుభావులు - అందరికీ అభివందనములు !!

"మాతృభాష మీద - మాత కంటెను గూడ
హెచ్చు మమత ఉండవచ్చు ప్రజకు !
మనిషి - వెడల వచ్చు - మాతృభూమిని వీడి,
మసలు మనసులోన - మాతృభాష"

- డా॥ నండూరి రామకృష్ణమాచార్య

"తేనియలకే తీపిపించే తెలుగులో మాటాడుకో
తెలుగుజాతి సమైక్య గీతి పదే పదే నువుపాడుకో
నాటి నన్నయ మొదలుగా ఈ నాటి యువకవి అవధిగా
తరగ లెత్తిన తెలుగు కవితల స్వరం నీలో నింపుకో !"

- డా॥ సి. నారాయణరెడ్డి

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" - అను సంస్కృత ఆర్యోక్తి తెలియని తెలుగు వాడుండడు కదా ! కన్నతల్లిని, మాతృదేశాన్ని వదలినను మాతృభాషను వదలిన మనుజుడుండడు గదా !

మన తరతరాల తెలుగు వైభవాన్ని, తెలుగుజాతి ఔన్నత్యాన్ని; తెనుగు సంస్కృతిని ఎన్నో వేల సంవత్సరాల నుండి ఎందరో మహానుభావులు కళాసాహిత్య రంగాలలో అకుంఠిత దీక్షతో జరిపిన అవిరళ కృషి ఫలితంగా ఉద్భవించిన అమృతరసతుల్య రాగరంజిత సుమధుర సుధారస గుళికలే మన తెలుగు పద్య గద్య సాహిత్య చంపూ కావ్యాలు

మనకున్న సాహిత్య సౌరభాన్ని అంతటిని పద్యకావ్యాలుగా అందించిన మహనీయులలో ముఖ్యులు నవయుగవైతాళికులు, ఆంధ్రపద్య కవితా పితామహులైన డా॥ నండూరి రామ కృష్ణమాచార్యు లొకరు !

పుంభారతీ స్వరూపులు, రససిద్ధులు అయిన నండూరి వారి కవిత్వం వడపోత పెట్టబడిన ఇక్షురసము. వీరి రచనలు కోకొల్లలు ! ఆణిముత్యాల వంటి కవితలను కొన్నింటిని సేకరించి నాకందించిన మాన్యులు శ్రీ మంతెన వేంకట సూర్యనారాయణరాజు కవి, సికిందరాబాదు వారికి కృతజ్ఞతాభివందనములను సమర్పించుకొనుచున్నాను.

అయితే పద్య కవితలల్లుట ఒక ఎత్తు - సంకలనం చేయుట మరొక ఎత్తు. కాని సంకలనం చేసిన కవితలు వెలుగు చూసేదెట్లా ? అని నా ఆలోచనమ్మున అన్వేషణ సల్పుచుండగా ... !

సహృదయులు ఆప్తబంధువయిన శ్రీ గూడూరు వేంకట హనుమంత రావు నన్ను అలరింపజేసి - "ఆచార్య శ్రీవత్సా! మీ తాతగారి కవితలు తప్పక వెలుగును చూస్తాయి ! వాని ముద్రణాభారాన్ని మేము వహించుతాము. శ్రీ సరస్వతీదేవికి క్షీరాభిషేకాన్ని ఈ రకంగా చేసి తరించిన వాళ్ళమవుతాము. కనుక మీరు తలపెట్టిన ఈ బృహత్కార్య క్రమ యజ్ఞంలో మేము కూడా సమిధలవుతాము" - అని దంపతులిరువురు పల్కగా కడుంకడు సంతోషించితిని.

శ్రీమాన్ నండూరి వారి పద్యకవితలు, గేయాలను గుదిగ్రుచ్చి "విహంగ వీక్షణం" - అను పేరున ముద్రిత గ్రంథంగా వెలుగులోనికి తీసికొను వచ్చుటకుద్యుక్తుడనైతిని.

నాకు స్ఫూర్తిని, చైతన్యాన్ని కల్గించి ప్రగతిపథంలో నడిపించిన శ్రీ హనుమంతరావు దంపతులకు శ్రీ సాయినాధుడు సంపూర్ణ ఆయురారోగ్య సౌఖ్యసంపదలు కల్గించాలని ప్రార్థించుచున్నాను.

"తాతగారి మాట - తనరారు పూదోట;
మార్గదర్శకమ్ము - మానవులకు
ఆటవెలదులందు - ఆప్యాయతను నింపి
పల్కుచుందు రెపుడు - ప్రాభవముగ"

చంద్రుని కో నూలుపోగులా శ్రీ నండూరి వారి పద సన్నిధికి "విహంగ వీక్షణమను" కర్పూర తాంబూలాన్ని సమర్పిస్తూ ...

సెలవు
భవదీయుడు

ఆచార్య శ్రీవత్స

కన్వీనరు & సెక్రటరీ,
తెనుఁగు భారతీ సాహిత్య పరిషత్
ఆంధ్రప్రదేశ్

# ముద్రాపకులు





శ్రీరమ్యాకృతి కల గూ
దూరాన్వయ సోముడు; తతుడున్ వరహితుడున్
భారద్వాజ సగోత్రుడు
ధౌరేయుడు వరలుచుండు తాత్త్విక దృష్టిన్.

పోణిమిగ దలచెను విమల
మాణిక్యాంబకు విభుండు - మహితాత్ముండున్
వాణీ దేవికి యిమ్ముగ
జాణతనంబున సపర్య సల్పుచు కూర్చెన్

అలరు లలితుడతడు - హనుమంత రావను
పుణ్యమూర్తి వినుత బుధుడు నెపుడు
సాహితీ ప్రియుండు - సదమలగతి కాంచి
సేవ జేయు చుండె - చిత్తమలర !

# జాతీయ పతాకం

1. తెలుపు - స్వచ్ఛమైన తేజస్సునకు - గుర్తు
పంట పొలుపు తెలుపు పచ్చ రంగు;
తలప ఎరుపురంగు - త్యాగ రక్తము గుర్తు;
ఎగురు - మా ధ్వజమ్ము - గగన మందు.

2. ధ్వజము ఎగురు గాత - ధర్మ చక్రముతోడ
చదలపైన - భరత హృదులలోన;
స్వాగత ప్రత్తి యావత్ప్రపంచమ్ము
మా పతాకమునకు చూపుగాత !

3. తూర్పు ప్రొద్దు పొడుపు - తొలి యుషస్సులు గూర్చు;
ఉపనిషత్తు వెలుగు లుదయ మంద;
కనుల నిదుర బాపు - మనుజ లోకము నందు
మెదడు హృదిని గూడ మేలు కొలిపి

4. అన్ని సంస్కృతులకు - అర్ఘ్యపాద్యాలలో
స్వాగతమ్ము నిచ్చు; సంతసమున
భేదములను మరచి, భిన్నత్వముల యందు
భరతమాత ఐక్యమరయ గలిగి.

5. శ్రీ గంగా యమునోపేతే - కృష్ణా గోదావరీ యుతే
త్రి దిగంత సముద్రాంతే - జయహే భారతాంబికే !

6. ఉపనిష జ్జగన్మాతః - విశ్వ కల్యాణనాయికే
జ్ఞాన విజ్ఞాన శృంగాగ్రే - జయ హే భారతాంబికే !

* * *

# స్వాతంత్ర్య ప్రభాస

మేలు కొనుమో భరతవీరా
మేలు కొనుమో పూతచరితా
మేలు కొనుమో సర్వమానవ
సౌఖ్య వేదాంతీ !

చిమ్మ చీకటి - చెదరి పోయెను
వెలుగు వెల్లువ - విరిసె దిక్కుల
విజయ దుందుభి - వీరభారత
హృదుల మార్మ్రోగెన్.

ఏడు దీవుల - నాడునాడుల
నింగి వ్రేలెడు నీలి మబ్బుల
ఆడు చున్నవి - మూడు రంగుల
ధర్మ చక్రరుచుల్.

జ్ఞాన వికసిత చారుచక్షులు
వేద ఋషు లిట వెలసి పాడిరి;
సృష్టి తమములు చెదరిపోవగ
తొలి యుషస్సులలో.

శూర నేతలు - వీర మాతలు
ధ్యానశీలురు - జ్ఞానమూర్తులు
ధీర లలనలు తేజరిల్లిరి;
ఈపవిత్ర ధరన్.

భారతీయులు - కర్మవీరులు
భారతీయులు - జ్ఞానయోగులు
భారతీయులు త్యాగమూర్తులు
యుగ యుగమ్ములలో.

బుద్ధ దేవుడు గాంధి - పుట్టిన
పుణ్యభూమిని - విశ్వమానవ
శాంతి దీప స్తంభ దీధితి;
మార్గ దర్శి యగున్

ధర్మ చక్రాంకిత పతాకా !
ఈ పవిత్ర ధరిత్రి నెగురుచు
ఏలుకొనవే - మూడు ముప్పది
కోట్ల భరత హృదుల్.

తుంగ భంగ తరంగ సంగతి
కడలి గర్భము కనలి మ్రోగెను;
కలము నడుపుము కర్ణధారీ
తొట్రు పడకుండన్

గగనమందు కారుమబ్బుల
కటికి చీకటి; గ్రమ్ముచున్నది
ప్రళయ ఝంఝూ పవన ఘోషా
ఘూర్ణ గర్జనలన్.

వెనుక చూపును వీడి - ముందుకు
వేగ పోవలె - వెనుక నిలిచెడి
అలస హృదయుల కొరకు ఆగు
అదను కాదు సుమా !

పారు బోతుల వదలివేయుము
పిరికి పందల విడిచి పుచ్చుము
కదము త్రొక్కుచు కదలిపోరా
ఓ భరతవీరా !

భరత మాతకు భాగ్యధాత్రికి,
శాంతిసీమకు - ఆర్ష భూమికి
అన్నపూర్ణకు - అమృత శీలకు
హృదయ వందనముల్.

అసతు నుండీ సత్తు లోనికి
కటికి చీకటి నుండి వెలుగుకు
చావునుండీ - బ్రదుకు మేరకు
చేర్పుమో ! జననీ !

* * *

# తెలుగు తల్లి

జయము జయము - తెలుగు తల్లి
ప్రియతమ ధాత్రీమ తల్లి ॥ జయము ॥

అరుణోదయ కిరణోజ్జ్వల
రాగ రచిత రంగవల్లి
పసిడి పలుకు - పాలవెల్లి !
లలితా కళా కల్పవల్లి ! ॥ జయము ॥

కదలి తేడు - కడుగును నీ
కాళ్ళను కెరటాల నీళ్ళ;
కళ్ళకద్దుకొను - నీ తల
గగనము - ఉల్లాసముతో ॥ జయము ॥

వంశధార - నాగావళి
వసంత సౌరభములతో
ధగధగలాడును - నీ మను
సిగ - మల్లెల మాలలుగా
గోదావరి పూదండగ;
క్రాలును - నీ గళ మందున
కృష్ణవేణి - కింకిణీక
మణిమేఖల - మార్ మ్రోగును;
చెన్నారును - స్వర్ణముఖీ
పెన్నలు - మంజీరములై; ॥ జయము ॥

నీలో భారతదేశపు
నాలుగు దిక్కులు - కలిసెను !
సమన్వయ సవిత్రి నీవు !
సహన నేత్రి నీవు సదా ॥ జయము ॥

ప్రాజ్య మగధ రాజ్యములో,
ఉజ్జయినీ గగనములో,
నీ విజయ ధ్వజ మెగిరెను !
నీ దుందుభి నినదించెను;
జరిపినారు - ఇక్ష్వాకులు
శతసహస్ర హల దానము
మా జనయిత్రివి నీవే !
మధుర ధరిత్రివి నీవే !
అక్షయ పాత్రవు నీవే !
అమృత చరిత్రవు నీవే ! ॥ జయము ॥

పుట్టినారు - నీ కడుపున
బోధి సత్త్వ మేధావులు,
సారస్వత - సమరాంగణ
సార్వభౌమ బిరుదాంకులు;
దయావీర దానవీర
ధర్మవీర ధన్యాత్ములు ! ॥ జయము ॥

వాదాలకు వారధివై,
భేదాలకు స్వస్తి చెప్పి,
కొత్త పాతలకు - కూరిమి
కూడలివై - వర్థిల్లుము;
కవితారస కల్యాణీ !
గానామృత మయవాణీ !
సస్య శ్యామల గృహిణీ !
సర్వ హితాభిలాషిణీ ! ॥ జయము ॥

# స్వాగత సూక్తమ్

1. వేయి వత్సరాల వెలుగు గుండెల నింపి
మీరు చేరినారు కోరి - సభకు;
తెలుగు దనమునకు - ప్రతీకాధ్వజము లొచు;
స్వాగతమ్ము - మీకు - స్వాగతమ్ము !

2. అష్ట దిగ్గజ కవన సింహాసనములు
భువన విజయమ్ము లెడదలో పాదివి కొనిన
సహృదయ సుహృద్ వరులకు - స్వాగతమ్ము !
సభకు - అభివాద పూర్వక స్వాగతమ్ము !

3. గుండె పండె నట్టి గొప్ప మేధావులే !
కోరి ఇట్టి సభకు చేరగలరు;
కవిత జీర్ణ మగుట - కష్టయాతన గదా !
సభకు వచ్చినారు - స్వాగతమ్ము !

4. మిత హిత సూనృత వ్రత సమేతులు నూతన సాహితీ తథా
గతులు కవీంద్రులు జగంబుల పూచెడి పూలలో మధు
వ్రతులయి చేరి పుష్పాడులు రాసులు పోసెడివారు వాఙ్మయ
క్రతువున ఋత్విజుల్ - విరియు గావుత పల్కుల పండు వెన్నెలల్.

5. వేదిక నున్న వారలు - కవి ప్రవరుల్ మృదువాఙ్మనోజ్ఞమ
ర్యాదులు సుప్రసిద్ధులు మహాత్ములు స్రష్టలు ద్రష్టలున్ కళా
స్వాదులు - గుండె పండిన రసజ్ఞులు విశ్వజనీన రమ్య వి
ద్యా దయితుల్ మనీషులు - మహర్షులు నందరకున్ ప్రణామముల్.

6. మిగుల విలువ గలది - మీ కాల మని యెంతు;
వచ్చినారు - మీకు - స్వాగతమ్ము !
చాల ముక్త సరిగ - సంభాషణలు సాగు
శారదార్పనమ్ము - జరుగు గాత !

* * *

# కైవారము

1. కవుల కంటె - తుహిన కర్పూర నిభ కీర్తి
   తెచ్చి రెవరు నీకు తెలుగు తల్లి ?
   సాహితీ తరంగ సంగీత రసధుని
   దేశ భాషలందు - తెలుగు లెస్స !

2. తరపి వెన్నెల - ఆణి ముత్యాల జిలుగు;
   పునుగు జవ్వాజి - ఆమని పూల వలపు;
   మురళి రవళులు - కస్తూరి పరిమళములు
   కలసి మేర్పడె సుమ్మ - మా తెలుగు భాష !

3. గోదావరికి కల్కి కుల్కుల నాట్య వి
   న్యాసములను నేర్పె నన్నయ కవి !
   గరువంపు మురువు - వాల్ గనుల యంచుల నింప
   తెనుగు వాణికి నేర్పె - తిక్కన కవి !
   మందార మకరంద - మాధుర్యములు తెల్గు !
   పొలముల పండించె - పోతన కవి !
   స్వర్గ లోకమునుండి - పారిజాతము దింపి !
   తెనుగు సాహితి నాటె - తిమ్మన కవి !

4. మువ్వ గోపాలు చిన్నారి మురళి తోడ
   తాండవింపగఁ జేసె - క్షేత్రయ్య గీతి;
   తెలుగు హృదయాల తాంబురా తీగె మీటి
   అమృత రస తరంగిణి జేసె త్యాగరాజు.

* * *

# ఆరాధన

1. పూర్వాంభోనిధి కాళహస్తి నగరీ - శ్రీమన్మహేంద్రాచలః
శ్రీ శైల ప్రముఖ త్రిలింగ శిఖరీ ప్రాతర్నవోష స్వినీ
కృష్ణా కంకణ కింకిణీ ఝణ ఝణద్ గోదావరీ కాంచికా
ద్రాక్షాపేశల వాఙ్మయీ ! విజయతాం ! త్రైలింగ పృధ్వీ స్థలీ !

2. జయతు వింధ్యాచల కిరీటా - జయతు స్వర్ణముఖీ నదీ మం
జీర శింజిత మంజు మంజుల చరణ కంజాతా

3. ధర్మ శూర సుత ప్రసూతే - దేశ భాషాతి శయ కవితా
రస నిభృత నిర్ఝర సమేతా - జయతు ప్రియమాతా

4. ఖడ్గ వీరాః కార్యశూరాః - సాహితీరణ సార్వభౌమాః
బోధి సత్వాః తవప్రియ సుతాః - పూజ్యమాతృధరే.

5. ఔత్త రాహ రసార్ద్ర హృదయం - దాక్షిణాత్య విదగ్ధ మేధా
తవ శుభగ తరళ మంగళ - సూత్రయుగళ దళే

6. యత్ర భాషణ కరణ శుద్దిః - యత్ర కరుణార్ద్రానుభూతిః
తత్ర కృపయా సర్వదాస్మాన్ - గమయ ప్రియమాతః

7. యత్ర దాస్యం నాస్తి భావే - యత్ర విశ్వ హితైకదీక్షా
కార్యరూప నిరంతరా స్యాత్ - తత్ర గమయ సదా

8. హృద్విధేయా యత్ర ధిషణా - యత్ర హేతుః సంప్రదాయ సు
వర్ణ నిగళక బంధ ముక్తః - తత్ర గమయ సదా !

9. సంగీతార్ద్రా మధు రసధునీ కావ్యలావణ్య పూర్ణా
శ్రీమన్నాగార్జున నగ కళా శిల్ప సాహిత్య ధాత్రీ
త్యాగబ్రహ్మ ప్రగదిత మహాగాన సామ్రాజ్య రాజ్ఞీ
విశ్వాదర్శా విజయతు విశాలాంధ్ర పృధ్వీమతల్లీ !

* * *

# కవితా కల్హార మాలిక

క్రొన్నన తావి - తెమ్మెరలకున్ గిలిగింతలు పెట్టినట్లు; లే
వెన్నెల నింగి గంగ పృథివిన్ పడి నట్టులు; యుద్ధభూమిలో
వెన్నుని గీత బోధ - వినిపించిన యట్టులు; గండు కోకిలల్
గున్న రసాల మెక్కి కుహుంకూ రవలుల్ పచరించి నట్లు; పూ
గిన్నెల తేనె సోన - పులకించిన తుమ్మెద - గ్రోలినట్లుగన్
చిన్ని గులాబి లేవలపు చెక్కిలి - బాల మరీచి మాలికన్
సన్నల రక్తితో - తొలి ఉషస్సుల స్వాగత మిచ్చినట్లు; ప్ర
పన్నుడు భక్తితో పరమ భాగవతోత్తము డాసి నట్లుగన్;
ప్రన్నని సన్న సామెత ప్రపంచ ప్రదక్షిణ చేసి, పేర్మి పై
అన్నువ గుండె లందనుభవాకృతి తాల్చిన యట్లు; తమ్మిపూల్
కన్నెలు, ఏటి గట్ల జలకమ్ములు తేలిన యట్లు; ప్రేయసీ
సన్నిధి - గుండె - తాండవము సల్పి యట్టులు; జాజి మొగ్గ వాల్
గన్నుల సిగ్గు దొంతరలు క్రాలి - సుగంధము చిమ్మినట్లుగన్;
పున్నమ రేయి చందురుడు పొంగులు వారెడు పాలవెల్లిపై
వెన్నెల ఆరబోసినటు; వేణు రవమ్ము స్రవించి నట్లుగన్;
ఉన్నత మానసాంబు చలదూర్ముల హంసలు ఈదినట్లుగన్
పన్నగ భామినీ మణులు కింపురుషుల్ - హిమవన్నగంబుపై
మిన్నులు వడ్డ చోటులు గమించి - విహారము సల్పినట్లు; తా
కన్న కుమారు - తల్లి - బిగి కౌగిలికిన్ కయిసేసి - ప్రేమతో
చన్నులు చేపి నట్టులు; ప్రసన్న జగత్ ప్రతిబింబ దర్శినీ
సన్నిభ దర్పణంబటుల సాహితి పెంపెసలార; అభ్ర వి
ద్యున్నిభ భావ వీచికలతో - రుచిరంబుగ పొల్చి - నాల్క పై
వెన్న కరంగు నట్టుల - కవిత్వము చెప్ప - మనోహరంబుగన్.

★ ★ ★

# అన్యాపదేశము

**వాన చినుకు :**

వాన చినుకు తోడ - వచియించె సెలయేరు
"రమ్ము - స్వాగతమ్ము - నమ్ము; నన్ను
అడుగ బోకు దారి - కడలి చేర్చెద నిన్ను
ఎడద కనుల విప్పి వెడల వచ్చు"

**జలకణం :**

"సమము నీవు నేను - శాస్త్ర ప్రకారమ్ము"
పలికె నీటి లోని - జల కణమ్ము;
"నేల మీది నిజము - నీవు నేనును వేరు"
పలికె బదులు - జలధి జలకణమ్ము.

**గడ్డి పోచ :**

"గాలి వీచె - ఎండు గడ్డి పోచా, నీవు
ఎగుర గలిగి నావు గగనమునకు !
గర్వ పడకు మనతి కాలమ్ము లోపలే
పడక తప్పదీవు - పుడమి పైన"

**నెలవంక :**

"కాళ్ళ క్రింద నున్న - చిళ్ళ పెంకును నన్ను;
పరమ శివుడ వగుచు కరుణ చూపి;
నీవు తాల్చినావు - నెలవంకగా చేసి
శిరము నందు - గగన సీమ వెలుగ"

**క్రొవ్వొత్తి :**

"విస్తరించి నాను - వెలుగునే నలుదెసల్"
క్రొవ్వి పలికె నొక్క క్రొవ్వు వత్తి;
వీచె తలుపు లదర వెనువెంట పెనుగాలి
అంత క్రొవ్వు వత్తి - ఆరిపోయె !

* * *

# శీర్ణ మేఖల

1. ఈ నడి రేయిలో - ఇభపురేశ్వరు అంతి పురాన, హర్మ్య సో
పాన పరంపరాగ్రముల పైన కెకాయెకి ఎక్కు ఎవ్వడీ
మానిసి ? రాణి భానుమతి మందిర రత్న కవాట కాంతిలో
ఆనన సీమ వెల్గెడిని ! అంగధరేశుడు సూతసూనుడే !

2. అనుగు సఖుని దుర్యోధను నరయు కొరకు
పవలు రేలనక అతడు వచ్చుచుండు;
కంటికిని కూర్కు లేకుండ కాచుచున్న
ద్వారపాలకు లెవ రాప నేర రతని.

3. అంత - కవాటమున్ దెరచి ఆతడు లోనికి ఏగినంత, ఏ
కాంత వినోద కేళి, చెలికత్తెను గూడి, సుయోధన క్ష్మా
కాంతుని కాంత, హైమ మణి కల్పిత సుందర తల్ప మందు, అ
త్యంత నివేశ నిష్ఠ - చదరంగము నాడుచు నుండె అసమ్మోయిన్

4. వెలుగు నీడల గళ్లలో వెలసి; మణి మ
యోభయ తురగ గజభట వ్యూహ రచన;
రత్న దీపాంకుర ప్రభా రాగ పంక్తి
మెరయుచుండె - కన్నుల మిరుమిట్లు గొలిపి

5. అంగ ధరాతలేశ్వరుని ఆగమనమ్మును గాంచి, వారలున్
చెంగున తల్ప సీమ డిగి చెంతను నిల్చిరి; సూతసూనుఁడున్
బంగరు పీఠిపై నొడలు వ్రాలిచి మెల్లగ విశ్రమించె; ఆ
అంగనలున్ తమిన్ తిరిగి ఆటకు చేరిరి తోడు తోడుతన్

6. "ఎచ్చట కేగినాడు ధరణీశ్వరు" డంచు నతండు దేవి నే
నెచ్చెలి కోసమై అడిగె, నెమ్మదిగా మరు బల్కె నామెయున్;
"చెచ్చెర వత్తు నంచు చనె శ్రీఘ్రముగా నెటొ, పాదచారియై;
వచ్చుచు నుండు నంచు మది భావన చేసెద నే ప్రతీక్షమై"

7. "పోమెద నంచు" పల్కి చనబోయెను పీఠము నుండి లేచి రా
ధేయుడు; దేవి భానుమతి తెల్పెను" వచ్చెడి వేళ యయ్యె ఈ
రేయి భవత్ సఖుండు నిదురింపరు మీ గమనమ్ము విన్నచో;
పోయినదేమి ? ఆగుడు ప్రభుం డిదె వచ్చెమనుండు వ్రేల్మిడిన్"

8. అని బదులాడి దేవి చదరంగము నాడుట కుద్యమించి నే
ర్పున చెలి ఆట కట్టుటకు పూనిన యంతట కర్ణు, డల్ల న
ల్లన సఖివైపు చేరి - పదిలంబుగ రాజును గాచి - దేవి ఆ
టనె కదిలించి నైచెను హుటాహుటి వారణ చారణమ్మునన్

9. కర్ణు డంతట ఆ చెలికత్తె స్థాన
మాక్రమించి తల్పమ్ము పై నధివసించె;
ఊడిగంపు చెలియు - ప్రక్క కొదిగి నిలువ;
ఎత్తు పై ఎత్తు - ఆట - సాగించి రంత.

10. ఎంతటి మాట ! హస్తి నగరేశ్వరు పట్టపు రాణి యట్టు లే
కాంత గృహమ్ములోన - నిజకాంతుడు లేని నిశీధి, ఏక శ
య్యాంతర వర్తియై తమిని అన్యునితో చదరంగ మాడు నా
వింతను తొంగిచూచె వినువీథిని తారలు పుల్కరించుచున్

11. కౌరవ చక్రవర్తి తన కర్ణుడు ప్రాణ సమానుడంచు శృం
గార గృహమ్ములో చనువుగా ప్రియమార ప్రవేశమిచ్చి ఇం
పారగ గౌరవింప మరియాద గణింపక - రాజరాజు దే
వేరిని గూడి ఆడు నృపవేశ్మము నందున సాహసమ్ములో !

12. అది - చదరంగ మందు గల అద్భుత తన్మయశక్తి - ఎప్పుడున్
మెదడు తదేక నిష్ఠమెయి నిల్వగ జేయును; హస్తి యుగ్మమున్
కదిపి హుటాహుటిన్ మెరసి - కౌరవ రాజ్ఞి బలమ్ము చీల్చి - అ
భ్యుదయము చెంది గర్వ భరితోక్తుల నెమ్మది సంభ్రమింపగన్

13. "త్రోసి రాజో ! లేకుయ్యాల త్రోసి రాజో ! !
కోరు కొను" మంచు - కర్ణుడు - గ్రుచ్చి గ్రుచ్చి
పార వేశ్వరు రాణిని ప్రశ్న వేయు
చుండ, మెట్లెక్కుచుండె - దుర్యోధనుండు.

14. ద్వారము వెన్కనుండి; మద వారణ యాన మనోజ్ఞ మంద గం
భీర విధాన, మేడ పయి మెట్లను ఎక్కుచు వచ్చుచున్న - ఆ
కౌరవనాథు భానుమతి గాంచి, తటాలున ఆట వీడి, బం
గారపు పట్టు పాన్పు దిగ - కర్ణుడు కొంగును బట్టి నిల్పగన్

15. క్వణదణు కింకిణీ కలిత కాంచన మేఖలమై, ఝుళంఝుళ
న్మణిమయ - శింజినీ ధ్వనుల - మార్మోగమై విదలించె ఆమె కొం
గును; అపరంజి కాంచి తెగి కూలెను కర్ణుని హస్తవేగ చా
రణమున, హేమరత్నమణి రంజిత కోమల కుట్టిమమ్మునన్

16. కట్టెదుటను మున్న - కౌరవాధీశుని
ప్రాణ మిత్రుని మోము - నరయలేక !
హైమ కాంచిని వీడి - అందందు పడిపోయి
చెదిరిన మణు లేర - చేయి రాక !
స్తంభించి నిలిచిన - సతి - కురుపట్టమ
హిషి అవస్థ మది నూహింప లేక!
ఏమి యెరుగకయె - ఇంతలు సలిపిన
తన్ను గూర్చి - తన కర్తమ్ము గాక !

కనక తల్పము జారిన - కర్ణు హృదయ
మందు - విద్యుల్లతారోచి - అశనిపాత
మగ్ని పర్వత జృంభణ - మబ్ధిఘోష
ధరణి కంపమ్ము - లేక మై తాండవించె

17. మంద మనోజ్ఞ హాస సుషమా మృదు భావ మరీచి వీచికల్
కందువ లందు వెల్లిగొన - కౌరవనాథుడు ఆత్మ దేవికిన్ -
చిందిన మేఖలా మణుల - చెచ్చెర నేరి యొసంగి "ఆగ్రహం
బందిరొ ! రాణివారు ! క్షమ కర్ణుడు నాప్రియ మిత్రు డిమ్మెయిన్.

18. ఎరిగి చేసి తప్పు గాదెంత వారి
కైన క్రమ్ము్మను చదరంగ మందు మత్తు !
ఎప్పటి యటుల కర్ణు మన్నింపు" మనుచు
ప్రార్ధనలు సలిపె - ఛలోక్తి పరిఢవింప

19. అనునయ మొంది రాణి అధరాంచల మందలి లేతనవ్వు వె
ల్గును మృదులాంగుళీగ్రసిత కోమల పక్ష్మము లందణంచి యీా
ర్చెను; కురుచక్రవర్తి తన స్నేహితు జేకొని మేడమీదికిన్
జనె; నునుసోగ వెన్నెలల చల్వలు గ్రమ్మె ధరాతలమ్మునన్

20. వెన్నెలల కంటె చల్లని వెలుగు వెల్లి
విరియు సుకుమార హృదయ పవిత్రమైత్రి;
ఎల్ల లోకాలలో ప్రసరింపసాగె
అమృతరోచు లాచంద్ర తారార్కమౌచు.

★ ★ ★

# ప్రగతి గీతమాల

1. సరస కవిత యన్న - సంగీత కళయన్న
వ్యంగ్య మన్న - లలిత హాస్యమన్న
అవని విముఖు లున్న - అదియె వారికి శిక్ష
వేరు శిక్ష ఇంక వేయ నేల ?

2. మింటి చుక్క లదర - మిరుమిట్లతో వెల్గి
చివర తుస్సు మనును చిచ్చుబుడ్డి
ఆంధ్రు లెల్ల అట్టి ఆరంభ శూరులే
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

3. విషయ సంకలనము - విజ్ఞానమా ? కాదు !
ఇటుక లము వేరు - ఇల్లు వేరు:
అస్థి పంజరమ్ము - అసలు దేహముకాదు
ప్రత్తి వేరు - నేత బట్ట వేరు

4. మానుజు లెల్ల - రక్త మాంసాల ముద్దలే
అంతరాత్మ భేద మరయ దగును;
వెదురు ముక్క చూడు - వేణువుం జూడరా
రమ్య హాస లోల - రామ కృష్ణ !

5. సంస్కరింపనేల ? సంఘ మంతయు నీవు -
సజ్జనుండ వగుము - స్వార్థ ముడిగి;
ఒక్క నీచు డపుడు - ఉర్వీలోపల తగ్గు;
రమ్య హాస లోల - రామ కృష్ణ !

6. ఆమె పేరు కవిత - అతిలోక సుందరి
సవతి తల్లి జగతి చావగొట్టు
కారు కంటినీరు - మారు ముత్యాలుగా
కోరి ఏరుకొనని వారలెవరు ?

★ ★ ★

# రాధనురా !!

కానడ 'రాగం - ఆది' తాళం

రాధనురా ! మురళీధర !
మరచిన చిర గాథనురా ! మాధవ !
మధురాపురి దేవేరిని గానుర
ఎద లోపల మెదిలే బాధనురా ! ॥ రాధనురా ॥

ఊదకు ఊదకు వేణువు కృష్ణా !
ఊదుచు నాయెద ఉయ్యాల లూగకు
సితశత పత్రాంచిత నేత్రాంచల !
క్షణ చంచల కాంచన చేలాంచల ! ॥ రాధనురా ॥

కాఫీ రాగం - ఆది తాళం

పూఁబొదరిండ్లను దాగకు కృష్ణా !
దాగుచు దాగుడు మూతలు ఆడకు;
కేళీశ్రిత శిఖి పింఛాభరణా !
లీలా తాండవ నిక్వణ చరణా ! ॥ రాధనురా ॥

విడువుము విడువుము - వాల్జడ కృష్ణా !
జడలో పొగడలు - ముడవకు కృష్ణా !
శ్యామల కోమల చారు శరీరా !
మంజుల యమునా కుంజ విహారా ! ॥ రాధనురా ॥

★ ★ ★

# లేజవరాలనురా !

**యమన్ కల్యాణిరాగం - రూపక తాళం**

నవనవలాడెడి లేజవరాలనురా ! మురళీధర !
నిలువగ జాలక జలజల పారెడి సెలయేరునురా ! ॥నవనవలాడెడి॥

ఎండకన్ను ఎరుగకుండ - తవిరాకుల తలదూరిచి
బుగ్గలు కగ్గని సిగ్గుల మొగ్గనురా ! మురళీధర ! ॥ నవనవ ॥

**నవరస - కన్నడ**

నగలమారి వయ్యారము - సొగసులూరు నయగారము
చిలిపి సిగ్గు సింగారము - కలికి చూపు కైవారము
చవి యెరుగని దాననురా ! రుచి మరుగని దాననురా !॥ నవనవ ॥

**హుసేని**

తలపు పాలకడలి చిలికి - వలపు వెన్నముద్దచేసి
నిండు గుండె వెండికుండ - కోరి కోరి కూర్చినాను
ఆరగింపరారా చేరి - కోడె వయసు సొగసుకాడ ॥ నవనవ ॥

★ ★ ★

# నా హృది !

**బేగడరాగం - ఆదితాళం**

నా హృదియే - యమునా నది యైనది
యౌవనమే - యమునానది యైనది

చిరుగాలికి నీ శిరమున ఆడుచు -
తళుకులు బెళుకులు కుళికెడు పింఛము
నా హృదయమ్మున నాట్యము చేయుచు -
పెనుపురి విప్పిన కనువేదురురా ॥ నా హృదియే ॥

నా హృది - మెదలెడి మృదు కలరవమే
నామది కలచెడి నును కలరవమే

నీ పెదవులపై - వినదించెడి
ఆ పిల్లనగ్రోవిని! వినిపించుమురా
॥ నా హృదియే ॥

రెక్కలు మొలిచిన కమ్మని కలలను
చుక్కలపై విహరింపగ విసరుచు
కలిపితి నాతొలి వలపుల పరిమళ సౌందర్యమ్ములు బృందావనిలో
॥ నా హృదియే ॥

**రీతిగౌళ - చాపు**

రారా ! రారా ! రారా ! రారా !
సంగీత రసికాగ్రణి రార !
శృంగార రసరాన్మణి రార !
బృందావన విహారా రార !
మురళీగానలోలా రార !
రార ! నృత్యవిలోల రారా !
ఆర్ద్ర హృదయ విహార రార !
కపట నాటక సూత్రధారీ రార !
సంగీత రసికాగ్రణి రార !
శృంగార రసరాన్మణి రార !

**హమీర్ కల్యాణి**

మంజు మంజుల మధుర మంజీర మణినూపుర కింకిణీ రవ
రాగరంజిత రాధికా మృదుచరణ చారణ చక్రవర్తి !
రార ! సంగీత రసకాగ్రణి !
రార ! శృంగార రసరాన్మణి !

★ ★ ★

# గురువు

1. అహము కొంత లేక - ఆత్మవంచన లేక
గొప్ప యెంత యున్న - గురువు కాదు ;
శిష్యుడగుట సులువు - జిజ్ఞాస యున్నచో
వినయమున్న యెడల - వేత్తయైన

2. బోధ చేయు గురుడు - పాగ గొట్టమా ? కాదు
సుత్తి కాదు - వాడి కత్తి కాదు
రాపిడులకు రవ్వ లీనెడు రాయి;
జ్ఞానబీజములకు వాన జల్లు

3. కాగి కాగి పాలు - గడ్డమీగడ కట్టు
పిదప మారిపోయి - పెరుగు - అగును;
చదివి చదివి పడయు - జ్ఞానమ్ము - విద్యార్థి
గురువు - "తోడుచుక్క" - పెరుగునందు

# లలిత కళలు

1. జననమందె - కవిత -జగదుద్భవము ముందె
సృష్టి చేయనెంచు - స్రష్టమదిని ;
శిల్పమవతరించె - సృష్టితో పాటుగా
కవలబిడ్డ యాచు - అవని మీద;

2. వెలసె - చిత్ర విద్య - తొలియుషస్సులలోన
పూచినట్టి మొదటి పువ్వుతోడ;
రాగ తాళ లయల - బ్రహ్మాండ రుతితోడ
అవని మీద గాన మవతరించె.

3. నరులతోడ - స్రష్ట - ధరణియంతయు నింప
పుట్టి - గొప్ప నటన - చిట్టచివర ;
ఇన్ని కళల వెరసి - ఈ జగన్నాటకం
బాది అంతులేని - అద్భుతమ్ము

★ ★ ★

# నదులు కలుపు

1. కరువు - నీటి కొరత - వరద బీభత్సమ్ము
   ఏకకాల మందె - ఎచట నుండు ?
   బుద్ధి హీను లేలు - పుడమిలోపల గాక
   మార్పులేని దేది - మనిషియందు ?

2 కదలిపోవుచుండ - గలగలా - గోదారి
   పసిడిపంటలేవి పండవెపుడు!
   గంగనీరు తెచ్చి కావేటిలో కల్పు,
   వరద బాధ తగ్గు - కరువు తీరు.

3. ప్రజలు దద్దరిల్ల - ప్రతి వర్షఋతువులో
   బ్రహ్మపుత్ర వరద బాధ లేల ?
   కలియుగాక వచ్చి - కన్యాకుమారిలో
   పొంగి పారలి - బ్రహ్మపుత్ర కాల్వ

4. ప్రజల హృదులు కలియు - భవితవ్యమేకమై
   సకల నదుల లోని జలము కలియ;
   అభ్యుదయము కలుగు - ఐకమత్యము హెచ్చు,
   భరత ఖండ మందు ప్రజల మధ్య

5. చెరువు లెల్ల నింపు - భరత దేశము నందు
   ఊరు ఊర "త్రాగునీరు" చేర్పు;
   పడుగు పేక వోలె - పంటకాల్వలు త్రవ్వి,
   నదులు కలుపు - ప్రజల హృదులు కలుపు.

★ ★ ★

# జీవిత సూక్తము

1. ఆశ లెండమావు లటంచు - అనిన యెడల
భయములున్ - రజ్జు సర్పవిభ్రాంతి గావె ?
మిథ్య గాదోయి జీవితోన్మేష మెల్ల;
పురుష కారమే యేకైక పరమపథము.

2. ముందు రాబోవు శుభదినములను గూర్చి,
తియ్యని పగటి కలలు సృష్టించు కొనకు;
జరిగిపోయిన నాటి సంస్మరణ లేల ?
తాల్పు మిప్పుడే - నేటి కర్తవ్య దీక్ష

3. బ్రదుకొక మాయదారి కలవంటి దటంచు తలంపకోయి కం
దుదలను క్రమ్ముచున్న తడితో; తుది లక్ష్యము వల్లకాడు - మే
నిది ఒక మట్టిబొమ్మ; కడకియ్యది మట్టినె చేరునంచు గ
ద్గదికముతో వచింప సరిగాదది ఆత్మకు అన్వయించునా ?

4. కావున శోకదైన్యములు గ్రమ్మగ నీయకు, నేటికంటె ఈ
జీవనయాత్ర రేపటికి చేరుము ముందుకు; సంకుల వ్యధా
జీవిత రమ్య యుద్ధమును చేయుము వీరుడవై జిగీషతో;
పోవకు గొఱ్ఱెపోతువలె బుఱ్ఱను వంచి - గతానుగామివై.

5. ఉత్తమ పూరుషావళి మహోజ్జ్వల జీవచరిత్రలెల్ల - లో
కోత్తర కార్యనిర్వహణ కూర్జిత శక్తి నొసంగుచున్ - మహో
దాత్త మొనర్పు జీవిత విధానము చూపును; వచ్చువారి కా
వృత్తులు చెప్ప, భూమి కనుపింపగ నిమ్ము భవత్పదాంకముల్

6. ఈ మహానంత కాల వాహినిని తేలు
భగ్ననౌకుడు సోదర పథికు డెవడొ !
అడుగు జాడల నొక్క నాడరసి నపుడు
పగిలిన హృదిని - దిద్దుకోవచ్చు - తిరిగి

* * *

# చాటువులు

**సమస్యాపూరణము :** చేరు చకచక మృదు చమ
త్కారము స్థిర శంప యొచు కాంతిచ్ఛవి మ
చ్చారిమ లొలుకు సమస్యా
పూరణములు తెల్గుబాస పొంపిరి వోవన్.

**ధన్యజీవి :**

సంతత మందహాస విలసన్ముఖ మండల మందునన్ సగా
సంతసమున్ వెలార్చెడు ప్రశాంత మనస్కుడు - నిత్యతృప్తు డ
శ్రాంత జగద్ధిత క్రియలు సల్పెడువాడు - పరోపకార వే
దాంతి - అజాత శాత్రవుడు - ధన్యుడు - మానవ సంఘమందునన్

**రాజకీయనేత :** రాళ్ళు రువ్వినారు రాజకీయునిపైన
వేలకొలది ప్రజలు వెక్కిరించి!
ఆత డిల్లు కట్టె - ఆ రాళ్ళనే పేర్చి!
రమ్య హాస లోల - రామకృష్ణ !

**అప్పు :** అప్పు చేసి అతడు గొప్పగా వెలుగొందె!
రాజు వోలె - చివరి రోజు వరకు!
అసలు చెడిన దెవరు ? అప్పు లిచ్చిన వారె !
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**నూతన సంవత్సర శుభాకాంక్షలు :**

శ్రేయ మగుత - స్వస్తి - శ్రీరస్తు - శుభమస్తు
కలలు - పాత కోరికలను తీర్చి,
అభ్యుదయము మీ కితోధికముగ పేర్చి;
క్రొత్త వత్సరమ్ము కూర్చు గాత !

మెదడులోన - మార్క్సు - హృదిలోన బుద్ధుడై!
విప్లవమ్ము - కరుణ - వింగడించి;
పుట్టుగాక - 'సుకవి' - భువనైక పౌరుడై
ప్రగతి కొరకు - నూత్న జగతి కొరకు.

# ఛత్రపతి శివాజి

సేనాధిపతి బాజీ - ఆత్మబలిదాన స్వచ్ఛందంగా చేస్తూ శివాజీతో అన్నమాటలు

శా॥ చంచర్ఘోర శతఘ్ని వీర నివహజ్వాలానలా భీలమై
పంచారించు మొగల్ చమూబలము గెల్వంజాల మెట్లైన యత్
కించిత్కాలము లోయలో నిలిపెదన్ - క్షేమమ్ముగా రక్షణో
దంచర్ రాజగడంబు చేరుడిదె - కర్తవ్యమ్ము వీరాగ్రణీ !

శివాజీ గురువైన సమర్థరామదాసస్వామితో అన్నమాటలు-తన రాజ్యాన్ని-భిక్షా వందనములుగా సమర్పిస్తూ -

మ॥ సముడై యెవ్వడు ముక్తకర్మ చయుడై సన్యాసియై రాజ్య భా
రము దాల్పంగ అనుగ్రహించె నిట ఆబ్రహ్మజ్ఞు ధన్యస్వరూ!
పు మహాత్మున్ ప్రియదర్శనున్ పరమతిం బూజించి అర్పింతు రా
జ్యము అస్మద్గురు రామదాసముని పాదాంభోజ యుగ్మంబులన్.

మ॥ విజయశ్రీ గొనివచ్చు వీర సమరావేశమ్ము మీ పాదపం
కజ సాన్నిధ్యమువల్ల కల్గినది; ఈ కాషాయధ్వజోద్ధారులై
ప్రజలొక్కుమ్మడి వచ్చినారలిదె విశ్వశ్రేయ మాశించుచున్
యజనార్థుల్ వలె - కన్గొను మిందుల కరుణాపాంగావలోకంబులన్

శ్రీశ్రీశ్రీ సమర్థ రామదాస స్వామి సమాధానం

శా॥ సంతోషించితి నీదు ధర్మమతికిన్ సౌశీల్య సంపత్తికిన్;
కాంతారంబుల ముక్కుమూసుకొను మోక్షాకాంక్షికిన్ రాజ్య దు
ర్దాంత ప్రాభవ మేల ? నా ప్రతినిధిత్వం బిచ్చితిన్ సర్వభూ
తాంతర్యామి జగద్ గురుండెపుడు తోడై మిమ్ము రక్షించుతన్

ఉ॥ కావుము - వీరుడా భరతఖండము శత్రువు నుండి - కానిచో
పోవును వీర భారత విభూతియు పుణ్యము పురుషార్థముల్;
కావున మాతృదేశమునకై - ఒరతీసిన కత్తి - నేటి యు
ద్ధావని ఎన్నడున్ ముడువ నన్న ప్రతిజ్ఞకు ధన్యవాదముల్.

# ధర్మచక్రం (నాటకం)

## (యువరాజు బిందుసారుని పద్యాలు)

కోయిల కమ్మగా వగరు గొంతుకతో యెలమావి గున్నలన్
కోయుని కొమ్మకొమ్మపయి కోమల గీతిక లాలపించె; లే
బ్రాయము పాల పొంగు క్షణ భంగురముల్ మనజీవితమ్ములున్
ప్రేయసి చేరరమ్ము విహరింపగ ఈ సెలయేటి తిన్నెలన్.

కాయమ శాశ్వతమ్ము - క్షణకాలము పోయిన రాదు; సంజ కెం
జాయలు గ్రమ్మె, పశ్చిమ దిశాముఖమందు, విలంబమా సఖీ
మాయ జగత్తు - నీవొక అమాయకురాలవు; పూల మొగ్గలే
పూయును గాని వాడి పడిపోయిన పూవులు పూయ వెన్నడున్

ఆయువు గల్గు నాల్గు గడియల్ మన జీవిత మొక్క స్వర్గమున్
చేయగవచ్చు - రమ్ము - వికసించిన పూల - రసాలవాటికా
చ్ఛాయల సందులన్ బుడుత చంద్రుడు వెన్నెల లొల్కె- స్వర్గ శో
భాయత మయ్యె పుష్పవనమంత - వసంత మహోదయమ్ములో.

కామము దోష మంచు కలికాలము నేటికి వచ్చెనంచు - ఏ
మేమొ వచించు చుండెదరు వృద్ధులు నోటికి వచ్చినట్లు మా
యామయమైన దీ ప్రకృతి యంతయు పూచిన పూలతో గృహా
రామలతా నికుంజములు రమ్మనుచున్నవి లెమ్ము నెచ్చెలీ

నీ చిరునవ్వులో అమృత నిర్ఘరిణీ నవచంద్రికా సుధా
రోచులు తాండవించును సరోరుహనూత్న పరీమళ ప్రభా
వీచిక లట్లు - సంజ అర వచ్చిన గొజ్జగి పూలమొగ్గనై
పూచిన మల్లె పువ్వు లయి పొంగును రెక్కలు వచ్చి - స్వప్నముల్
లెమ్ము-శుభోదయమ్ము-లవలీ సుమముల్ నవసాంధ్యరాగముల్
చిమ్మె ప్రపంచమెల్ల - సరసీ సలిలమ్ముల విచ్చు మొగ్గ కెం
దమ్మిని చేరె ఝుంకరణ నాదముతో నును వెచ్చతేనెకై
తమ్మెద తేడు - తూర్పు దెస తోచెను బాలమరీచిమాలియున్.

# ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

## (- తారా తోరణము)

శాస్త్ర విజ్ఞాన మహనీయశక్తి చేత
 సమయసీమల పంచభూతముల నెల్ల
కైవసమ్ము గావించుకో గలిగినట్టి
 నవ్య నాగరకత కభినందనములు.

ఓ నవశాస్త్ర దారుణ మహోగ్ర కఠోర వికార ఘోర వి
జ్ఞాన వికాసమూర్తి ! విషచారిత రక్త రసప్లుత ప్రభా
లీన కటాక్ష మేల ప్రసరించెదవోయి ! సహస్రశీర్ష పం
చానన విశ్వరూప విలయాంతక భీకర గర్జనార్భటిన్

ఆకాశమ్మున పక్షి పోలిక విమానారూఢ శుంభ ద్విహా
రాకాంక్షాపరిపూర్తి; చేప వలె నీరాంతర్గతి ప్రాభవ
స్వీకారమ్మున విశ్వజేతవగుచున్ - జీవింపలేవేల ? భూ
లోకంబందున మానుషత్వమున - చాలుంజాలు విజ్ఞానముల్.

'ఆటము బాంబు' - రెక్కల జలాంతరగాములు - కాలకూట దుష్
కీటక వాయుజృంభణము క్రిందులు మీదులు లేక - సంగరో
ద్ఘాటన సల్పుటన్ - బ్రదుకు చావుల, దుఃఖ సుఖాల క్లిష్ట శృం
గాటక మందు నిల్చిరి - జగచ్చరితంబున నేటి మానవుల్.

"ఈ పెనుమంటి దిబ్బ వసియించి రొకానొకనాడు మానవుల్!
పాపము ! శేముషీ విభవ పారగులై ప్రకృతిన్ జయించి - వి
శ్వాపరసృష్టి సల్పి, ప్రళయాంతక బుద్ధిని గుండె లేక - ఆ
త్మోపహతిన్ వినాశనము నొందిరి అందరు జ్ఞానశూన్యులై"

అనుచు - హతశేషమై అవని మిగులు
ఏ పిపీలకలో రచియించుకొనును
కరుణ గీతులను తమ వాఙ్మయము లోన!
ఇయ్యది అవశ్య భవితవ్య మేమొ మనకు.

స్వాదు కవిత్వ సంభరిత శాంతి సుధారస గాన నిర్ఝరీ
నాదము నింపుచుండు మొక నాడధికారికి ఈ జగద్ధితా
వేదన గుండె లోన ప్రభవింపకపోదు - నవీన సభ్యతో
న్మాద మహాజగత్తు - వినినన్ వినకున్నను చిన్నబోకుమా!

# ఆనంద సూక్తము

ఆయువు గల్గు నాల్గు గడియల్ భువి మీద ప్రమోద హావ భా
వాయత నేత్ర దీధితుల ఆడుచు పాడుచు నవ్వుకొంచు - లో
కాయతనం బొనర్చు - జగ మంతయు ఈశ్వర చిద్విలాస తే
జోయుత తన్మయత్వమున సొంపులు నింపును పువ్వుటీరమై.

ఆనందోల్లసనమ్మున్ మధుర గీతాలాపనన్ సుందరో
ద్యానామోద వితర్ది చేయుము భువిన్; దౌర్జన్య దంష్ట్రోగ్ర హిం
సా నాట్యమ్ము నెదర్చి నిల్పుము దయా శౌర్యమ్ముతో; ఈ పురా
క్షోణిన్ మానవ జన్మ గల్గెనని ఔత్సుక్యాన గర్వింపుమా.

లీలానంద చిదార్ద్ర రాగరస లాలిత్యమ్ము నిండార - భూ
గోళమ్మున్ గ్రహ తారకా నివహమున్ గూర్చున్ జగత్ స్రష్టయే
కేళీతాండవమూర్తి; విశ్వమయ సంగీతామృతాంతర్ఝరీ
హేలాయోగ లయాప్తి నీ బ్రదుకు సంధింపన్ ప్రయత్నింపుమా.

ఈ మహి వింత పత్ర మిట ఇంచుక సేపు నివసించి పోవు వా
రీ మనుజుల్; వృధా వ్యధల నేల తపింప ? ప్రమోద శీలివై
యే మమకారమున్ గొనక యీ యిహ నాటక రంగమందు నీ
భూమిక నిర్వహించుటకు పూనుము - నేర్పున మేలు బంతిగన్.

నీ సహజన్ములన్ గలిసి నిర్మల సుందర మందహాస రే
ఖాసుకుమారతల్ విరియుగా సుఖియింపు మనోజ్ఞ గాన వి
న్యాస తరంగితం బయిన నాట్య వినోదము నందు - మంగళా
శాసనమున్ ధ్వనించు నిముషంబుల దాక - రసజ్ఞ మూర్తివై.

* * *

# ముత్యాల గొడుగు - నుండి

భాష　　భాష వాడునట్టి - ప్రతిపదమ్మును గూడ,
త్రిభుజ సదృశ మంచు - తెలియదగును;
దేశ కాల పాత్ర - దృష్టి విశ్లేషించి
అర్థ భేద మరసి - అరయ దగును.

కాలం　　కాల మనిన క్లిష్ట - గణిత ప్రహేళికే
దేవమాన పరిధి - తెలియరాదు;
తమ్ము డగును అన్న - తారాపథములోన
యాత్ర చేసి మరల - అవని చేర.

సంగీతం　　స్వర్గ సీమ నుండి - సంగీత కళ పేర,
దిగును నేల పైకి - దివ్య శక్తి;
విద్యమానమగును - సద్యః పర సమాధి;
అంతరాత్మ రసనిరంతర మగు

విశ్వశాంతి　　వేగ మలచ వలయు నాగళ్ల మొనలుగా
కత్తులెల్ల - గుండె కరుణ నింపి
శాంతిదూత పాడె సంగీత మేనాడొ !
యుగ యుగాంతరమ్ము లులికి పడగ.

ప్రగతి　　విద్య - ఉచిత వైద్య ముద్యోగ యోగముల్;
ప్రభుత కూర్చవలెను - ప్రజల కెల్ల,
త్రాగు నీరు - బస్సు - గ్రంథాలయము లేక
ఒక్క గ్రామ మైన - ఉండరాదు

ఆత్మహత్య　　జరుగ ఆత్మహత్య - స్పందించవలె - జనుల్;
అది కుటుంబ పరిధి హానిగాదు !
సంఘగతులయందు - సర్కారు జతు లందు
కలదు లోక మంచు - తెలియవలెను

# ప్రగతి గీత

**ఎన్నికలు**

మునిగి పోవు - నీట - మణులు మాణిక్యముల్;
గులక రాళ్ళె ఈత కొట్టవచ్చు !
గగనమునకు పాము లెగురు - రెక్కలు వచ్చి
కలల అలలు ఎన్నికలకు సిరలు

**నెల జీతం**

విలువ గట్టరాదు - నెల జీతమునుబట్టి
చదువు బట్టి - బ్రదుకు పదవి బట్టి,
ఐహిక 'తుల' యెట్టు లంతరాత్మల తూచు ?
ధరణి మీద ఏది "ధర్మకాట" ?

మెచ్చు వచ్చు - "ధ్వనులు" మేటి కావ్యము లందు
మరి - ప్రతిధ్వనులను - మరువ దగును;
వాణి మెచ్చు - సొంత బాణీల మాత్రమే
నీడ వేరు - అసలు నిజము వేరు.

**కలలు**

జగతి యెల్ల మధుర - సౌందర్య మయ మంచు
కనులు మూసి - కలలు - గాంచినాను;
కనులు విప్ప - తెలిసె - కర్తవ్యములు చేయ
వాసయోగ్యమగును - వసుధ యెల్ల

**మతము**

మతము - శాస్త్ర విజ్ఞాన గుంఫనము లేక
గ్రుడ్డి దగును - సమ్యగ్దృష్టి కోలుపోయి;
మహిత శాస్త్ర విజ్ఞానమ్ము - మతము లేక,
కుంటిదగును చైతన్యమ్ము కోలుపోయి.

# కవితా సంహిత

క్షణములోన పొంది - సర్వః పర నివృత్తి
బొందె తోడ - ముక్తి పొందవచ్చు
అంతరంగ మందు - అమృతమ్ము కురిపించి
పొసగ వచ్చు - కవిత - రస సమాధి.

ముసలితనము రాక ముందె - పెద్దరికమ్ము
పడయవచ్చు - కవిత వలన - జనులు;
బధిర సంఘమునకు - బహిరంతరాత్మలై
కదల గలరు - కవులు - మెదలగలరు.

అరయ మానవుండు - ఆలోచనాశీలి;
మెదడు హృదయమున్న మేటి జీవి;
మానవతకు - కవిత - మరి పరాకాష్ఠయే;
కవిత - రాచరికము కన్న - మిన్న.

నరుని పరిధి దాటి - పరిణామ సృష్టిలో
ఎడద - మెదడు కలిసి - ఎదుగు గాత !
అధిగమించి - నరుడు - అధిమానవుడుగా
అందుకొనుత - క్రొత్త ఆకసములు.

కాంతి చిలికి - కవిత - అంతర స్నానమ్ము
కూర్చగలదు - మనుజు గుండె లోన;
అమృత మొలికి - భావితాంతఃకరణ గూర్చి;
చేయు - కవిత - మానసిక చికిత్స.

కలవు - తాళ లయలు - కవిత యందునగూడ
కారయిత్రి - తారహార సమము;
ఏక లయను చేరి - ఏక శ్రుతిని గూడి
శ్రవణ సుభగ మగుత - శబ్ద సంధి.

ఛందముండవచ్చు - స్వారస్యములతోడ,
యతులు గలిగి - ప్రాసగతులు గలిగి
కలిగి యుండుగాత - కవిత - లయను
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

# జగదేక పార్లమెంటు

తిండి లేంక - వివిధ దేశ దేశాలలో
మాడు వారు - చాలమంది కలరు;
ఖర్చు లెందు కంత - గ్రహయానముల పైన?
ఉత్సవాల పైన - ఉర్విలోన ?

చేయు గొప్ప వ్యయము - సేనా నిమిత్తమై
ధరణి నేలుచున్న దొరతనములు
తరిమి వేయవచ్చు - ధరణి దారిద్ర్యమ్ము;
సైనిక వ్యయమ్ము సమసిపోవ
జరుగుచుండు - ధరణి - సైన్యాల కోసమై
గుండె దద్దరిల్లు గొప్ప వ్యయము;
గ్రాస వాస దైన్య రహిత మౌ ధర యెల్ల
సైనిక వ్యయమ్ము సమసినపుడు

ఈ ధరిత్రి మేటి మేధావు లెందరో
కరుణ యున్నవారు కలరు - నేడు;
తలపరేల ? ఏక ధరణీ ప్రభుత్వమ్ము ?
వసుధ కెల్ల - ఐక్య పార్లమెంటు ? ?

మతము కులాది వర్గములు - మాపును దృష్టిని సంఘ మందు - మం
చితనము మానవత్వము నశింపగ చేయును - సర్వదా జగ
ద్ధితమును కోరునట్టి నరుడే - నిజ మైన నరుండు - ధాత్రి - ధ
న్యత యన - మానవుండు వసుధైక కుటుంబిగ నిల్వ గల్గుటే.

కదన రంగములకు - కాలదోషము పట్టె;
పలుక దగును స్వస్తి - కలహములకు,
రాక్షసుండు కోరు - రక్తపాతము - హింస;
సర్వజనుల సుఖమె సాధు కాంక్ష !

సమత - స్వేచ్ఛ - సర్వ సౌభ్రాత్ర భావాలు!
సాధ్య మగునె ? వివిధ జనులలోన ?
వాస్తవమ్మ అగునె - వసుధైక రాజ్యమ్ము ?
ఐక్య పార్లమెంటు నందు తప్ప ?

★ ★ ★

# మరణ మంగళా శాసనం

1

మరణ సమయమందు - మధుర గానము చాలు;
వద్దు - మందు లేవి వాడ వద్దు;
ఏ గతించి నప్పు డేడ్వరా దెవరేని;
ఏడ్పు అనిన - నాకు - ఏవగింపు.

2

మైల పట్టవద్దు - మంత్ర తంత్రము వద్దు;
స్నాన శౌచ నిరతి చాలు చాలు;
జరుప వచ్చు - సుకవి సత్కార మొకనాడు
దుఃఖ లవము సుంత దొరల కుండ.

3

జరుపవద్దు - నాకు - శ్రాద్ధ కర్మల నేవి;
వద్దు - పెట్టవద్దు - తద్దినాలు;
బాల బాలికలకు - బహుమానములు తీర్చి
ఏ దినమున నైన - ఇవ్వవచ్చు.

4

ఏది పూర్వ జన్మ మెట పునర్జన్మమ్ము!
వసుధ - మనిషి - నీరు వంటి వాడు !
మంచు గడ్డ - నీరు - మరి ఆవిరియు వేరు !
ఒరుగు నట్టి దేమి ? ఒకటి యైన ! !

5

భార్య మ్రగ్గరాదు పసుపు - కుంకుమ వీడి
పదవ నాటి తంతు వద్దు వద్దు;
భర్త చావు బాధ - భార్య ఓర్చుట చాలు;
వికట కర్మ కాండ వేధ వద్దు.

6

నేను - నాస్తి కుడను గాను - జీవితములో
మంచితనము మీద - మమత గలదు;
మతము మీద గాక - మానవత్వము పైన,
కలదు గొప్ప నమ్మకమ్ము నాకు.

7

క్రొత్త పాతలకును - గుండె లోపల - కోరి
కూడలి గుడి కట్టు కొంటి నేను;
హేతువాద సహిత సేతువై - జీవించి,
సాహితీ తపస్సు - సలుప గలను.

8

అంతము చెందు ఈ భువి సమస్తము - సృష్టియె దిగ్దిగంత వి
శ్రాంత మశాశ్వతమ్ము రవిచంద్రుల తోడ - మనుష్యుచావు - ఓ
వింత ఉదంతమా ? వికట వేదన లెందుకు ? సర్వతాప ని
ష్క్రాంత మవశ్యమంగళము - చావొక సృష్టి వర ప్రసాదమే.

★ ★ ★

# నండూరి రామ కృష్ణమాచార్యులకు కవితా కల్హార నీరాజనము

శ్రీ గురుం కవితాన్న శ్రీ దాయకమ్ రామకృష్ణకమ్
ఆచార్య పురుషం వందే నమ శ్శిరసా ముదా ॥

- బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ

తన చూపులోని స్నిగ్ధత శిష్యహృత్ కంజ
వాత్సల్య సూర్య బింబమ్ము గాగ,
తన పల్కులోని మార్దవము వాఙ్మయ గంగ
జనియించు నీహార మనగ,

తన దరహాస ముద్ర - కవిత్వ గగన రా
కాచంద్ర సాంద్ర విక్రాంతి గాగ,
తన కీర్తి - శరదంబర నితాంత కుంద ము
క్తాహార విదిత సంక్రాంతి గాగ;

అలరు విద్యార్థి కల్పకంబగు మహర్షి,
భూరి కరుణాస్పదుండు నండూరి బుధుడు;
సంస్కృతాంధ్రాంగ్ల నందనాంచద్విహార
సరసమతి రామ కృష్ణమాచార్య సుకవి.

- డాక్టరు మేడసాని మోహన్

శీర్ణ మేఖలా కావ్య సృష్టి కర్త;
తెలుగు నధికార భాషగా తీర్చు నేత;
వేల శిష్యుల హృదయాల వెలుగు మాత;
రామ కృష్ణుడు ధీరస రాజ్య దాత.

- డాక్టరు గరికపాటి నరసింహారావు.

# ప్రశంసా ప్రసూనాంజలి !!

- వేముగంటి నరసింహా చార్యులు

క॥ శ్రీ నండూర్యాన్వయ చం
ద్రా ! నిష్ఠిత రామకృష్ణమాచార్య కవీం
ద్రా ! నిత్యకవన రచనా
ధీన మనీషాచతుర ! సుధీనుత చరితా !

క॥ మేలగు బోధనమున శి
ష్యాళిని కడు తీర్చిదిద్ది ఖ్యాతి గని కళా
శాలాధ్యాపక పదవిని
లీలగ సాగించితివి ఫలిత సత్కార్యా !

శా॥ పాండిత్యమ్మును, సత్కవిత్వరచనా ప్రాగల్భ్యమున్, సుస్థిరా
ఖండ ప్రజ్ఞము కల్గు తావక యశః కర్పూర సౌరభ్యముల్
నిండెన్ నాలుగు దిక్కు లందునన్ లసన్నిష్ఠా గరిష్ఠాత్మకా !
నండూర్యన్వయ రామకృష్ణ కవి చంద్రా ! కోవిద గ్రామణీ !

గీ॥ కడగి ఆంధ్రపద్యకవితా సదస్సు కా
ధ్యక్షమును వహించి దీక్షత మెయి
నిర్వహించుచున్న నిను రామకృష్ణమా
చార్య ! కవిజనమ్ము సన్నుతించు

శా॥ నీ యా లోచన లోచనమ్ము సువిధా
స్వీతమ్ము, సామాజిక
శ్రేయోదాయ కారణమ్మగుచు
వాసిన్‌గాంచె, పీయూష పా
థేయమ్మై, వరలున్ జనాళికి సుపా
దేయమ్మగున్ పద్యవి
ద్యాయుక్తిస్థిత ! రామకృష్ణ సుకవీంద్రా !
నీకు దీర్ఘాయువౌ !

# గురు స్తవము

- ఆచార్య ఫణీంద్ర

శ్రీ నందూరి కులైక భూషణుడు - నిశ్శేషాంధ్ర సాహిత్య సు
జ్ఞానానంద మయుండు - స్వచ్ఛమగు బంగారంపు పద్యంబులన్
నానారీతుల కావ్యభూషలుగ తానందించి ఆంధ్రాంబకున్,
ఈనాడందెను ఆంధ్రపద్య ఘన సంస్థేశుండుగా మన్ననల్ !

'రామకృష్ణమాచార్య' సన్నామధేయు
డెపుడొ, ఏబదేడుల నుండి ఏకధాటి
పద్యకవితలన్ సృజియించి పండిపోయె -
మహిని, పద్యమ్మునకతండు - మారుపేరు !

'తారాతోరణము' తెలుగు
సారస్వత భువనభవన సంయోజితమౌ
ద్వారమునకు కట్టి, అతడు
ధారుణిపై నవ్యకాంతి ధారలు కురిసెన్ !

'ప్రగతి గీత'ను ప్రవచించి ప్రజల కొరకు
నవ్య కృష్ణుడు సార్థక నాముడయ్యె -
ఆంధ్రభాషామ తల్లికి - అందమయిన
నెలవు, 'కవితా ప్రభాస'ను నిలిపి నతడు !

కువలయమున నున్న కుటిల నీతిని ఎత్తి
కుండబ్రద్దలట్లు కొట్టి చూపి;
అభ్యుదయ పథమ్ము 'నాలోచనము' పేర
వెలయ జేసినట్టి విప్లవకవి !

అతుల కవీశ్వరుండు, కవితాంబకు ముద్దుల పట్టి - పండిత
స్తుత ఘన సాహితీ కుసుమ శోభన వాటిక యందు మేటి క
ల్పతరువు - మాధురీ రసమపారము నిండిన పద్య శిల్పముల్
శతములు చెక్కుచున్, పలుకు శాసనమౌ గురుదేవు మ్రొక్కెదన్.

# ఓ రససిద్ధ స్వరూపా !

- ఆచార్య శ్రీవత్స

శ్రీ వాణీ కృప సత్కృతి
భావమ్మునఁ బ్రోదిచేసి భవ్యమనస్వీ !
శ్రీవిశ్రుత ఘనకీర్తీ !
దేవా ! భక్త్యంజ లిద్ది తెచ్చితి కొమ్మా !

పుంభారతీ స్వరూపా !
అంబోధిని మించిన కరుణార్ద్రాంచితమా !
గంభీరోన్నత లలితా !
లంభిత హృది రామకృష్ణ ! లక్ష్యముఁజేతున్ !

తత నవాంధ్ర సాహిత్య పితామహుండు
తనరు పద్యకవిత్వ వైతాళికుండు;
నవయుగ రససిద్ధుండు - మానవహితుండు;
లలిత పదధుని - నందూరి రామ కృష్ణ !

పరిమళోజ్జ్వల దివ్య పారిజాతమువోలె
లలిత కోమలమైన తలపుప్రోఢ !
నవరసానందమై నవనీత పద్యాల
కవితా ప్రియత్వంబు కల్గుఁడేఁడ !

అవలీలగా కూర్చి ఆలోచనమ్ముతో
 ఋషుల తత్త్వమ్ముల నెఱుగువాడ !
ఆంధ్ర పద్య కవితా యాగమ్మున విమల
 ధర్మ రక్షణ దీక్ష తనరువాడ !
నవరు హృదిని కల్గు - నందూరి వంశాబ్ధి
చంద్ర ! మర్మవిదుడ ! జననమొంది
కెరలు వొడిచినారు - కెలసంబు సల్పుచు
కవనపటిమ తోడ - కాంచినారు !

తాతా ! నీ కవనమ్ముతో మధుర సంధానమ్ము కావించి నా
వే ! తాదాత్మ్యత నొందితిన్ విమల సంవిజ్ఞానమున్ బొందుచున్
పూతల్ పూసిరి పద్యగంధమున సంబోధింప లోకాన సం
భూతశ్రేణికి జీవన ప్రదములై పొల్పారు చుండెం గదా !

వ్రాసితి కైతజాలములు వైభవమైనది మీదు కూర్మి నా
యాశలు వృద్ధి చేయు మిక అంజలి పట్టితి పద్యశిల్ప సం
దేశము తెల్పినారు భవతేజము వెల్గె ధరాతలంబునన్
భాసుర మొప్ప గైకొనుము భాగ్యవిధాత ! నమస్కృతాంజలిన్.

* * *

# సువర్ణాభిషేకము

- యార్లగడ్డ వెంకట సుబ్బారావు

ఎవ్వాని జిహ్వాగ్ర మేకాంతవేదిక
నలిన సంభవు రాణి నాట్యమునకు
ఎవ్వాని శిష్యాళు లీవిశాల ధరిత్రి
దిగ్వి దిక్కులకు కీర్తి ధ్వజాలు
ఎవ్వాని యర్ధాంగి యెడ త్రెంపు లేకుండ
అతిథ్య మొనగెడి అన్నపూర్ణ
ఎవ్వాని సహపంక్తి నేవేళ భుజియింత్రు
పంచము లాదిగా పంచజనులు
అతడు మానవతామూర్తి అతుల కీర్తి
ప్రథిత నందూరి వంశాకారమున వెలసె
రామ కృష్ణమాచార్యాఖ్య రత్నమొకటి
ఆంధ్ర వాణీమ తల్లి పుణ్యంపు పంట

తన కవిత్వమహత్త జనతాహితోదాత్త
దిగ్దర్శకంబగు దీపకళిక
తన పాండితీ ప్రాఢీ ఘన సంస్కృతాంధ్రాంగ్ల
వాఙ్మయాంబుధికి కవ్వంపు కొండ
తన వాగ్విలాస వసన రసజ్ఞ ప్రజా
వ్యూహమానస వశ్యతోహరంబు

తన గుణ గ్రహణ పద్ధతి కుల మత వర్గ
పక్ష పాతమునకు వజ్రధార.
తన సుహృత్తత్వ మహిమ చందనపుచర్చ
హితుల కతిథులకును సమాగతులకెల్ల
తాను వృద్ధుండు తత్కవితా వధూ టి
నిత్య నూతన యౌవనాన్విత శుభాంగి
నీటు గోటుల మురిపించు ఆట వెలది.

ఓ కవితా తపోనిధి ! మహోత్తమ నూత్నసమాజ సృష్టికై
నీ కవితా సరస్వతి కనీనికలన్ వెలయించు దీప్తి కా
రాకులడుల్చి సాంద్రగహనాంతర సీమల విచ్చు క్రొత్త పూ
రేకుల తావు లుర్వి ప్రసరింప పునీతము చేయు గావుతన్
పొలుపుగ రాజధాని నడిబొడ్డున పద్య పతాక నీటుగా
నిలిపిన సాహసాంకుడవు నీవొకరుండ వటన్న సత్య మీ
తెలుగు మహాధరిత్రి నలుదిక్కులు నింగియు నేల గాలియున్
పలుకును రామ కృష్ణ కవి భాస్కర ! తావక కార్యదక్షతన్

ఇంకొక ముప్పదేండ్ల వఱకీకవితా రమణీ మణిన్ నిరా
తంకముగాగ నేలదగు దార్ఢ్యముతో, మధురాంధ్ర పద్యని
శ్శంక విహార దిగ్విజయ సారథివై రథివై సువర్ణ పీ
ఠాంకము చేర్పవయ్య ! మన ఆంధ్ర సరస్వతి తేజరిల్లగన్.

★ ★ ★

# Dr. NANDURI V. RAMA KRISHNAMACHARYA - THE RUSSHI

**By Polavarapu Jagadiswara Rao**

Dr. Nanduri V. Rama krishnamacharya, M.A; Ph.D., is one of the outstanding poets of Telugu literature.

He was the champion of the dignity of Telugu poetry. He strived hard to highlight the splendour and grandeur of Telugu poetry. He was unanimously elected as the president of "Andhra Padya Kavitha Sadassu".

He started his career as lecturer in DNR college Bhimavaram and later he joined Government service and served as lecturer in a number of Government colleges. He was posted by the Government as principal of the Newly started D.R. Goenka Government Degree College, Tadepalligudem.

Quite after some time has was transferred as principal of the prestigious pithapur Raja's government college, Kakinada. He had the distinction of serving that institution with Dignity and distinction, P.R. Government college was administered and shaped by stalwarts like the late Brahmarshi Raghuparthy Venkataratnam Naidu, late Vemuri Ramakrishna Rao, Peddada Rama Swamy, I.V. Chalapathy Rao and a number of administrators of eminence.

He was transferred to Dr. V.S. Krishna Government College, Visakhapatnam.

After his retirement he joined the service of TTD propagate Dharma. He was appointed as the chairman official language commission by the then chief Minister, PadmaSri N.T.R/ He has rendered yeoman service to the promotion of Telugu language by working with indomitable will and indefatigable energy. Many a Minister and Civil Servant had high appreciation of the valuable work turned out by him during his tenure.

From his forceful pen came out a number of works entitled (1) Velugu Bata (2) Tikkana Bharata Darsanam (3) Buddha Charitra - Dhammapatham (4) Dharma - Chakram, (5) Prachima Dakshhina Bharatha Charithra (6) Hasya Natikalu (7) Kavitrayamu Tikkana (8) Pragati Geetha (9) wisdom of the world - international quotations (10) Gandhian Eraan enlightened account about India's struggle for independence (in English) (11) Maha Bharatha, (TTD Publication) in English (12) Alochanam - Telugu Chatuvulu. The book Mahabharatha is so fascinating that had he published this monumental work, any where in the Occident, it would have brought him a Nobel Prize.

His 'Alochanam' excels vemana padyalu in though, content, narration and poetic composition.

Considering his all round genius kendra sahitya Akademi paid him this glowing tribute "within Recent years, one notices the beginning of a new movement, the return to classicism. It the leftists and surrealists rebelled against the romanticism of the earlier decades of this century, the neo classicists like Nanduri Krishnamacharyulu Jandhyala Papayya Sastry and G. Joshua are questioning the value of surrealism of the year from 1935 to 1960. Harmony, instead of strife, is their ideal. In the post war world an equilibrium has to be achieved between matter an spirit, between idealism and realism. The Neo classicist are anxious to regain for poetry its dignity as the symbol of all that is beautiful and true.

Professor G.J. Somayaji of Andhra University described "Dr. Krishna Macharya as a future tense amongst the modern poets. Telugu literature will reserve Coveteed place for him amongst the galaxy of the illustrious poets of Andhra".

He has been the recipient of humpteen awards like Karuna Sri Award, Dasaradhi award, Rayalaseema literary award, etc. He was been honoured throughout the Trilanga desa in various towns and cities in the circars, Rayalaseema and Talangana.

Never before a Telugu poet has received so much of honour and puraskaras like Dr. Nanduri. This versatile son is the gift of Telugu Talli to Andhras.

Extract from "Contemporary Indian Literature"
Published by the
Sahitya Akademi - New Delhi

## THE NEO - CLASSICISTS

Within recent years, one notices the beginning of a new movement, the return to classicism. If the Leftists and Surrealists rebelled against the romanticism of the earlier decades of this century. the neo-classicists like NANDURI RAMA KRISHNAMACHARYULU, Jandhyala Papayya Sastry and G. Joghua are questioning the value of the Surrealism of the years from 1935 to 1960. Harmony, instead of strife, is their ideal. In the postwar world, an equilibrium has to be achieved between matter and spirit, between idealism and realism. The Neo-classicists are anxious to regain for poetry its dignity as the symbol of all that is beautiful and true.

* * *

Dr. Krishnamacharya - is a Future Tense amongst the modern poets. Telugu Literature will reserve a coveted place for him amongst the galaxy of the illustrious poets of Andhra.

*Prof : G.J. SOMAYAJI*

# డా॥ నండూరి రామ కృష్ణమాచార్య రచనలు

1. వెలుగుబాట
2. తిక్కన భారత దర్శనము
3. బుద్ధ చరిత్ర - ధర్మపాదము
4. ధర్మచక్రం
5. ప్రాచీన దక్షిణ భారత చరిత్ర
6. హాస్య నాటికలు
7. కవిత్రయము - తిక్కన
8 ప్రగతి గీత
9. ఆలోచనము
10. తారా తోరణము
11. కవితా సంహిత
12. పద్య శిల్పము
13. శ్రీ వాసవీ కన్యాకాపరమేశ్వరి కళ్యాణము
12. Wisdom of the world - International Quotations
13. Gandhian Eraan Enlightened Account about India's Struggle for Independence (in English)
14. Mahabharatha (in English) TTD Publications

---

ప్రతులకు :

**డా॥ నండూరి రామ కృష్ణమాచార్య**

420, పెండర్ గార్డెన్స్ రోడ్, జవహర్ నగర్ కాలనీ,

సికింద్రాబాదు - 500 003 ఫోన్ : (040) 7817397